# నీకు దాహం వేస్తే!

"నిజం ఇది పాత కథే. సరికొత్తగా గుండె కోస్తున్న యుగాల కిందటి కథ. నీ మీద నాకు కోపం లేదు సుమా. బహుశా ఎప్పటికీ రాదేమో! అద్భుతమైన ఆ రాత్రిని నువ్వే నా కోసం ఇచ్చావు. ఇప్పటికీ నాకు ఆ నిమిషం, ప్రతి నిమిషం చాలా సజీవమైన జ్ఞాపకం. ఒక పచ్చని చెట్టు గబగబా పూలు పూస్తే.... నిలువెల్లా తావిలో నిండితే.... ఔను నేను నిమిషంలో మారిపోయాను. ఓ కొత్త భామ....

ఒక మగవాడి ప్రేమ మీద నాకు నమ్మకం లేదు. మనకు సంబంధంలేని ఓ కొత్త తెగకు చెందిన వాళ్ళనే నా అభిప్రాయం. కానీ ఆ రాత్రి మనిద్దరికీ దొరికిన ఏకాంతం నన్నెలా మార్చేసిందో నేనే కళ్ళారా చూశాను. ఎక్కుపెట్టిన బాణంలా వున్నానో... ఏమో! కొన్నేళ్ళ దాహం... శరీర దాహం... నన్ను నేను అణచివేసుకుంటూ దాచిపెట్టిన దాహం... అవును... ఆ నిమిషంలో ఆ దాహం తీర్చుకోవాలనిపించే ఆవేశం బహుశా నాలో!

ఉదయం నుంచీ ఆఫీసు పనిలో తలమునకలైపోతున్నా. నా మనసులో ఆ రాత్రే! మనిద్దరం ఏకాంతంగా ఉండబోయే ఆ రాత్రి గురించే ఆలోచనలు. ఎన్నిసార్లు నన్ను నేను గమనించుకున్నానో లెక్కలేదు. నా శరీరంలో ఎక్కడ అందం దాగివుందో, లెక్కవేసుకున్నా. 'పర్వాలేదు జయించగలను' అనిపిస్తోంది.

నాకు తెలుస్తోంది. మనుషుల మధ్య ఆలోచనలు ప్రవహించడానికి మాటల వంతెనలక్కరలేదు. నేను నమ్ముతోన్న భాష, నా చూపుల్లో ఆక్రోశిస్తున్న తీరు నాకు స్పష్టంగా అర్ధమైపోతోంది. ఒక ఉద్రేకపు జలపాతవేగం నన్ను నిలువెల్లా కదిలించివేస్తోంది. నన్ను ఊపేస్తోంది. ఎప్పటికో ఆఫీసు పని పూర్తయింది. కెంజాయ రంగులో ఆకాశం బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటోందనిపించింది.నిజం ఆ ఉన్మత్త సాయంత్రం, సముద్రపు ఒడ్డున నే తీసిన పరుగులు, తడిసిన నా చీరె కుచ్చెళ్ళవైపు ఆశగా చూసిన చూపులు తెలిసిపోతున్నాయి.

'నేను జయించాను'. నా ఉద్దేశంలో నిన్ను నేను గెలుచుకున్నాను. ఆ సాయంత్రం రాత్రయింది. వెలుగు తక్కువగా ఉన్న ఆ హోటల్లో ఏం తిన్నామో, ఎంత సేపు కూర్చున్నామో జ్ఞాపకం లేదు. నా కళ్ళ ముందు ఓ నిశ్చలన చిత్రం. నేను పట్టుతప్పి పోతూ నిస్సహాయంగా కిందికి జారిపోవడం. అవును. నేను మానసికంగా ఎప్పుడో పట్టు పోగొట్టుకున్నాను. చివరకు నే ఊపిరి బిగబట్టి ఎదురు చూసిన క్షణం రానే వచ్చింది. "భామా! కాసేపు ఏదీ ఆలోచించకు. నేను చాలా అలసిపోయాను. వైడోంట్ యు షేర్ సమ్ టైమ్? సమ్ అవర్స్?' ఒక ఉద్రేకపు తుఫానుగాలిలో నేను ఆకులా రెపరెపలాడాను. కొంచెం బ్రతిమిలాడితే... అదీ ఎందుకూ... ఇది నా అంగీకారంతోటే గాక అతని ఆశ కొద్దీ అనిపించాలనే కోరికతో కొన్ని నిమిషాలు అలా రాయిలా నిలబడ్డానంతే... నాకు తెలుసు. లోలోపల గట్లు తెగుతున్న ప్రవాహపు వేగం. నన్ను నిలవనీయని వ్యామోహం. ఆహ్వానించిన ఆ చేతుల్లోకి నే జారిపోవడం...

అంతే. ఇది కల కాదు సుమా..... ఆ నిమిషాలు శాశ్వతం కావాలని నా ఆలోచనా, ఆశ కూడా. అయితే అంచనా దెబ్బతిన్నది ఇక్కడే.

నా ఆశకూ, లెక్కలకూ లంగరు కుదరదు. ఆ ఒక్క రోజులో ఆ సంబంధం శాశ్వతం కావాలని నేను అనుకొంటే, ఆ ఒక్క రాత్రే ఆ మధుర స్మృతులు మిగుల్చుకోవాలని నువ్వు అనుకున్నావు. నా వాదన బలహీనమౌతోంది. నువ్వు చెప్పే రీజనింగ్‌కి నా 'ఆశ' నిలబడదు. తేలిపోతోంది. నీలో వున్న ఆ గణిత మేధావిని నేను గమనించనే లేదు. ఎంత విచిత్రమో చూడు. అచ్చంగా శరీరం చెప్పిన మాటే వింటోంది మనసు. అప్పటిలాగే నిన్నటి సాయంత్రమూ కెంజాయ రంగులోనే వున్నది ఆకాశం. అయితే చిత్రంగా అది నాకు రక్తారుణిమలాగా తోచింది. ఆ ఎర్రని రంగు నాకు భయం కలిగించింది.

మనిద్దరం మాట్లాడుతూ వుండగానే సాయంత్రం రాత్రయింది. అయితే ఆ చీకటి నన్ను వణికించింది. నేను లోలోపల గడ్డకట్టుకు పోయాను. 'భామా... సరిగ్గా గుర్తుకు తెచ్చుకో... నేనలసిపోయానన్నాను. కాసేపు నీ సాన్నిహిత్యంలో సేద తీరాలన్నాను. ఇందులో నిన్ను మోసం చేసిందెక్కడా? నువ్విలా నన్ను నిలదీయడం బావుండలేదు పెళ్ళి పట్ల ఇప్పుడు నాకు ఏ అభిప్రాయమూ లేదు. పైగా దాన్ని గురించి నేనిప్పుడే ఆలోచించడం కూడా లేదు. నాకు నా కెరీర్ ముఖ్యం. నాకు తెలుసు. నేనంటే నీకు ఇష్టమని. ఆ ప్రేమా, ఇష్టం లేకుండా ఒట్టి శరీరం పట్ల కాంక్ష చూపించేంత దౌర్భాగ్యుడిని కాదు. నా మెల్టింగ్ పాయింట్‌ని తాకావు నువ్వు. లేకపోతే ఆ రాత్రి అలా జరిగేది కాదు. సారీ భామా... ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ.... నువ్వు నన్ను పూర్తిగా అపార్థం చేసుకొన్నావు. పెళ్ళి, సంసారం, ఇవన్నీ నేను ఇప్పుడే ఆలోచించే సబ్జక్ట్‌లే కాదు.." అయిపోయింది. చేతులు దులుపుకుంటున్నావు.

అర్థం అవుతోంది. లోలోపల నుంచి ఉద్రేకం తన్నుకొస్తోంది. నిన్ను నిలదీయాలని ఉంది. మరి నన్నేం చేయాలని ఆ రాత్రి నా సాన్నిహిత్యాన్ని కోరావు? ఎందుకు నన్ను ప్రలోభపెట్టావు? అని అడిగేయాలని ఆవేశంగా వుంది. ఏడ్చేస్తానేమోనని భయంగా వుంది. నా కన్నీళ్ళతో నేను బలహీనమైపోవడం నాకు ఇష్టమే లేదు. నాకు తెలుసు. నీ దగ్గర సమాధానాలు సిద్ధంగా వున్నాయి. మనిద్దరినీ ఆ రాత్రి మోహం ముంచెత్తింది. ఈ నాగరిక జీవితం, అర్థం, పర్థం లేకుండా కెరీర్ కోసం మనం చేస్తున్న విన్యాసాలు ఏ ఎండమావుల వెంట పరుగులు పెడుతున్నామో మనం... నాకు అర్థం అయింది.

నేను రెండుగా చీలిపోతున్నాను. ఒకవైపు నేను విజేతనవ్వాలి. ప్రపంచం నన్ను నన్నుగా గుర్తించాలి. రెండో వైపు లోలోపల నేను అద్భుతమైన స్త్రీని. నన్ను, నా ప్రేమని గుర్తించి, నన్ను గుండెల్లో దాచుకునే ఒక ఆలంబన కావాలి. నేను నీకు పూర్తిగా తెలుసు. లోలోపల నేను 'పేరసైట్'ని కూడా. పూల తీవెలాగా బలమైన ఆధారాన్ని అల్లుకుపోవాలని కోరుకొంటాను. బహుశా స్త్రీలోనే ఇంత వైవిధ్యం ఉందేమో. ఇదే మగవాడికి అవకాశం ఇచ్చిందేమో, ఇప్పుడు అనుకొనీ, ఆవేదన పడీ, ఆలోచించీ ఆవేశపడటం ఎందుకు మిత్రమా! అయిపోయింది. నేను రాయినైపోగలను. విజయపథం చేరే మెట్ల వరసలోకి అలవోకగా అడుగుపెట్టగలను. కానీ లోలోపల ఏదో దగ్ధమైపోయింది. నన్ను నేను ఆవిష్కరించుకొన్న ఒక సౌందర్యరూపం వాడిపోయింది.

నేను ఘనీభవించిపోయే లోపలే నీ కోసం ఈ ప్రేమలేఖ రాస్తున్నా. చాలా ప్రేమగా రాస్తున్నా. ఇంకెవ్వరికీ ఎప్పటికీ రాయలేని ప్రేమలేఖ. నేను కొత్త తరం యువతిని. వ్యక్తిని. నాకు పోటీ నేనే. పురుషునితో నేను సమానురాలిని కాననే న్యూనత నాకు లేదు. లేదా అతనితో మాత్రమే సమాన హక్కులు కోరుకునే అవివేకమూ లేదు. నా దృష్టిలో నేనే విజేతను. కానీ విచిత్రంగా ఒక స్పందించే హృదయాన్ని లోలోపల దాచుకొన్న దాన్నే. అది ఎంతగా ప్రేమించగలదంటే నన్ను నేను ఆత్మార్పణం చేసుకోగలిగినంత. ఇక్కడ నేను లొంగిపోతాను. నేనివ్వగలిగే ప్రేమే నా బలహీనత. ఇప్పుడు చూడు ఆ లోపాన్ని సవరించుకుంటా. దాన్ని సజీవదహనం చేస్తున్నా, నేను హృదయం లేకుండా కూడా బతికేయగలను. అచ్చం నీలాగే. తప్పదు. ఇక నేను హృదయం లేని శరీరంలో నన్ను నేను దాచుకుంటా.

ఎప్పుడూ నా గుండె నిండా, పెదవుల్లోంచి, కళ్ళలోంచి, ఏకంగా శరీరం మొత్తంలోంచి పొంగిపొర్లిపోయే ప్రేమను, నేనే నిర్దాక్షిణ్యంగా పంపేస్తున్నా. నేల పాలు చేస్తున్నా. ఇప్పుడు నా కళ్ళ ముందు ఎడారి దృశ్యం. ఇప్పుడీ ప్రేమ నిండుకొన్న ఎడారిలో ఒక చిగురైనా మొలకెత్తదు. నెర్రెలు పడిన నేల నా కళ్ళముందు మైళ్ళ కొద్దీ పరుచుకుంటోంది. ఇప్పుడు చెప్పు. ఇంక ఎంత అర్థించినా ఆ అమృతం దొరకనే దొరకదు కదా! నిజం. నీకు ఇప్పుడు దాహం వేస్తే ఏం చేస్తావ్?? ❊

*11-4-2000*